Digital, tmedia.net.in

# టీ-మీడియా

tmedia.net.in

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక :336
పేజీలు : 5

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

బుధవారం 16/09/2026 టీమీడియా మెయిన్ ఎడిషన్ ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ





# ట్రంప్ సర్కార్‌కు షాక్

▶▶| వీసాల విషయంలో విద్యార్థులకు ఊరట




**టీ మీడియా , సెప్టెంబర్ 15 , ఢిల్లీ బ్యూరో :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వానికి మరోసారి కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. విదేశీ విద్యార్థులు, ఎక్స్ఛేంజ్ విజిటర్లు, జర్నలిస్టుల వీసాల విషయంలో తీసుకొచ్చిన కొత్త నిబంధనలను అమెరికా ఫెడరల్ కోర్టు తాత్కాలికంగా నిలిపివేసింది. కొత్త నిబంధనలు అమల్లోకి రావడానికి ఒక్కరోజు ముందు మసాచుసెట్స్ జిల్లా కోర్టు ఈ కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో అమెరికాలో చదువుతున్న విదేశీ విద్యార్థులు, ముఖ్యంగా పెద్ద సంఖ్యలో ఉన్న భారతీయ విద్యార్థులకు తాత్కాలికంగా ఊరట లభించింది.

ట్రంప్ ప్రభుత్వం జులైలో కొత్త వీసా నిబంధనలను ఖరారు చేసింది. వీటి ప్రకారం ఎఫ్1 వీసాలపై అమెరికాలో చదువుతున్న విదేశీ విద్యార్థులు, జే1 వీసాలపై వచ్చే ఎక్స్ఛేంజ్ విజిటర్లకు నాలుగేళ్ల కాలపరిమితి విధించాలని నిర్ణయించింది. అదే సమయంలో ఐ-వీసాలపై అమెరికాకు వచ్చే విదేశీ జర్నలిస్టుల వీసాలపైనా నిర్దిష్ట కాలపరిమితి పెట్టాలని ప్రతిపాదించింది. ప్రస్తుతం ఎఫ్1 వీసాలపై అమెరికాకు వెళ్లే విద్యార్థులు తమ కోర్సు పూర్తయ్యేంత వరకు డ్యూరేషన్ ఆఫ్ స్టేటస్ నిబంధన కింద అక్కడ ఉండే అవకాశం ఉంది. అంటే వీసాపై ముందుగా ఒక నిర్దిష్ట గడువు పెట్టకుండా విద్యార్థి తన చదువు కొనసాగుతున్నంతకాలం చట్టబద్ధంగా అమెరికాలో ఉండొచ్చు. ఈ విధానంలో మార్పులు చేసి నాలుగేళ్ల పరిమితిని తీసుకురావాలని ట్రంప్ ప్రభుత్వం భావించింది.

అయితే ఈ ప్రతిపాదనపై అమెరికా విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థలు, కార్మిక సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. దాదాపు 600 ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత విద్యా సంస్థలకు ప్రాతినిధ్యం వహించే సంస్థలు కోర్టును ఆశ్రయించాయి. కొత్త నిబంధనలను రద్దు చేయాలని కోరాయి. ఈ కేసులో విచారణ చేపట్టిన న్యాయమూర్తి ఎఫ్. డెన్నిస్ సేలర్ నాలుగోది ట్రంప్ ప్రభుత్వ వాదనలను పూర్తిగా అంగీకరించలేదు. కొత్త నిబంధనలు అమల్లోకి వస్తే అమెరికా ఉన్నత విద్యారంగం, ఆర్థిక వ్యవస్థకు భారీ నష్టం కలిగే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ ప్రభావం తీవ్రంగా ఉండొచ్చని, విద్యారంగానికి విపత్తు స్థాయి నష్టం కలిగే అవకాశాన్ని కూడా న్యాయమూర్తి ప్రస్తావించారు.

తగినంతగా పరిగణనలోకి తీసుకోలేదని!

ముఖ్యంగా దశాబ్దాలుగా అమల్లో ఉన్న విధానాన్ని ఒక్కసారిగా మార్చడానికి ప్రభుత్వం చూపించిన కారణాలు తగినంత బలంగా లేవని కోర్టు పేర్కొంది. విద్యార్థులు, విశ్వవిద్యాలయాలపై కొత్త నిబంధనలు ఎలాంటి ప్రభావం చూపుతాయన్న అంశాన్ని ప్రభుత్వం తగినంతగా పరిగణనలోకి తీసుకోలేదని (మిగతా 2లో)

# మంత్రులతో సమావేశమైన సీఎం రేవంత్ రెడ్డి



▶▶| 22ఏ అంశంపై చర్చ!

**టీ మీడియా , సెప్టెంబర్ 15 , హైదరాబాద్ బ్యూరో :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందుబాటులో ఉన్న మంత్రులతో భేటీ అయ్యారు. హైదరాబాద్? ఎంసీహెచ్ఆర్డీలో జరిగే ఈ సమావేశంలో 22ఏతో పాటు ఇతర ముఖ్యమైన అంశాలపైనా చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. 22ఏ భూముల అంశంపై తెలంగాణ ప్రభుత్వం కీలక కసరత్తు చేస్తున్న నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది.

బుధవారం అసెంబ్లీలో 22ఏ అంశంపై చర్చ జరగనున్న నేపథ్యంలో నిషేధిత భూముల విషయంలో నెలకొన్న సమస్యలు, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, వాటికి పరిష్కారం చూపే మార్గాలపై మంత్రుల సలహాలను సీఎం రేవంత్‌రెడ్డి (మిగతా 2లో)

# సౌదీ పైప్‌లైన్ మూసివేత



▶▶| భారత్‌పై ఎఫెక్ట్

▶▶| పెరగనున్న ఇంధన ధరలు!

**టీ మీడియా , సెప్టెంబర్ 15 , ఢిల్లీ బ్యూరో :** సౌదీ అరేబియాలోని కీలక ఆయిల్ పైప్‌లైన్ మూసివేత భారత చమురు దిగుమతులపై తీవ్రప్రభావం చూపే సూచనలు కనిపిస్తున్నాయి. హూతీ రెబెల్స్ వైమానిక దాడుల కారణంగా పైప్‌లైన్ మూసివేయడంతో, అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు మండిపోతున్నాయి. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే భారత్‌కు ప్రత్యామ్నాయ సరఫరాల ఖర్చు పెరిగి ధరల మోత తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**రోజుకు సుమారు 5 మిలియన్ బ్యారెళ్లు**

భారత్‌కు సౌదీ అరేబియా నుంచి ముడిచమురు దిగుమతులు తక్కువే అయినా దీర్ఘకాలంపాటు అంతరాయం కొనసాగితే దేశీయంగా ఇంధన ధరలపై ప్రభావం పడనుంది. హూతీ రెబెల్స్ ఈనెల 10న జరిపిన వైమానిక దాడుల నేపథ్యంలో సౌదీ ముందుజాగ్రత్త చర్యగా తన 1,200 కిలోమీటర్ల పొడవైన ఈస్ట్-వెస్ట్ ఆయిల్ పైప్‌లైన్‌ను మూసివేసింది. ఈ పైప్‌లైన్ ద్వారా సౌదీ ఎర్ర సముద్ర తీరానికి రోజుకు సుమారు 5 మిలియన్ బ్యారెళ్ల చమురు రవాణా అవుతుంది. ఇది ప్రపంచ చమురు సరఫరాలో దాదాపు 4-5శాతంగా ఉంది. ఈ పరిణామంతో అంతర్జాతీయంగా ముడిచమురు కొరత ఏర్పడే ప్రమాదం నెలకొంది. సౌదీ పైప్‌లైన్ మూసివేతతో అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు భగ్గుమంటున్నాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 107 డాలర్లు దాటగా, యూఏఈకి చెందిన మర్బన్ క్రూడ్ 119 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. పశ్చిమ తీరానికి రష్యా నుంచి వచ్చే చమురు సైతం బ్యారెల్‌కు 2.50 డాలర్ల ప్రీమియంలో ఉంది. ఈ అంతరాయం దీర్ఘకాలం కొనసాగితే ధరలు మరింత పెరిగే ప్రమాదం ఉందని ఇంధన రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**మార్చి- ఏప్రిల్? నెలల్లో రోజుకు 6లక్షల బ్యారెళ్లు**

భారత్‌కు సౌదీ నుంచి నేరుగా వచ్చే చమురు తక్కువే అయినప్పటికీ అసలు ముప్పు వేరేలా ఉంది. దేశీయంగా మొత్తం ముడిచమురు దిగుమతులు రోజుకు సుమారు 4.7 మిలియన్ బ్యారెల్స్ కాగా ఆగస్టులో సౌదీ నుంచి సరఫరా రోజుకు 3,15,000బ్యారెళ్లుగా ఉంది. సంక్షోభం గరిష్ట స్థాయిలో ఉన్న మార్చి- ఏప్రిల్ నెలల్లో దిగుమతులు రోజుకు సుమారు 6,00,000 బ్యారెళ్లుగా ఉండేవి. అయితే సౌదీ పైపులైన్ మూసివేత నేపథ్యంలో ప్రత్యామ్నాయ చమురు కోసం ఆసియా రిఫైనరీల మధ్య పోటీ పెరిగి, అమెరికా, ఆఫ్రికా, (మిగతా 2లో)

# మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల నాని కన్నుమూత

▶▶| పలువురు సంతాపం



**టీ మీడియా , సెప్టెంబర్ 15 , అమరావతి బ్యూరో :** మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్ (ఆళ్ల నాని) (57) కన్నుమూశారు. విశాఖలో మంగళవారం గుండెపోటుతో ఆయన తుదిశ్వాస విడిచారు. ఏలూరు నుంచి మూడు సార్లు ఆయన ఎమ్మెల్యేగా గెలిచారు. 2004, 2009లో కాంగ్రెస్ తరఫున విజయం సాధించారు. 2017లో ఎమ్మెల్సీగా పని చేశారు. ఆ తర్వాత వైఎస్సార్సీపీలో చేరి 2019లో ఆ పార్టీ తరఫున గెలిచారు. జగన్ హయాంలో డిప్యూటీ సీఎం, వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2025లో ఆళ్ల నాని టీడీపీలో చేరారు.

సంతాపం: మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని హఠాన్మరణం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్?, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 56 సంవత్సరాల వయసులోనే గుండెపోటుతో ఆయన దూరమవ్వడం బాధాకరమని చంద్రబాబు అన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆళ్ల నాని ఆత్మకు శాంతిని చేకూర్చాలని చంద్రబాబు ఆకాంక్షించారు. వివాదాలకు దూరంగా, అందరితోనూ స్నేహపూర్వకంగా మెలిగే నాని స్మృతిలో లోకేశ్? నివాళు లర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రజాప్రతినిధిగా, మంత్రిగా ఆయన అందించిన సేవలను స్మరించుకుంటూ పల్లా శ్రీనివాసరావు నివాళు లర్పించారు. నాని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన ఆకాంక్షించారు.ఆళ్ల నాని మృతి పట్ల కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆళ్ల నాని ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానన్నారు.

# మోదీ మళ్లీ రాజీపడ్డారు



▶▶| అమెరికా ఒత్తిడికి లొంగిపోయారు

**టీ మీడియా , సెప్టెంబర్ 15 , ఢిల్లీ బ్యూరో :** దేశవ్యాప్తంగా విస్తృతంగా వినియోగిస్తున్న యూపీఐ చెల్లింపులపై కేంద్రం తాజాగా జారీ చేసిన నోటిఫికేషన్?పై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు గుప్పించింది. ఈ లావాదేవీలపై చార్జీలు విధించేందుకు మార్గం సుగమం చేస్తోందంటూ లోక్?సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. రూ.2 వేలకుపైబడిన వ్యాపారి యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించే అవకాశం కల్పించడం ద్వారా జీరో-చార్జీ విధానాన్ని నీరుగార్చే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ఈ వ్యవహారాన్ని అమెరికా చెల్లింపు సంస్థల ఒత్తిడితో ముడిపెట్టిన ఆయన, ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి అమెరికా ఒత్తిడికి లొంగిపోయారని ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్?లో పోస్ట్ చేశారు.

**అమెరికా కంపెనీల ఒత్తిడే కారణమా?**

భారత్‌లో ప్రస్తుతం అమల్లో ఉన్న జీరో ఎండీఆర్? విధానంపై అమెరికాకు చెందిన చెల్లింపు సంస్థలు చాలాకాలంగా అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయని రాహుల్ గాంధీ ఆరోపించారు. యూపీఐ ద్వారా చెల్లింపులు జరిగినప్పుడు వ్యాపారుల నుంచి ఎండీఆర్ వసూలు చేయకపోవడం వల్ల చెల్లింపు సంస్థలకు ఆదాయ అవకాశాలు పరిమితమవుతున్నాయన్న వాదనలున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తాజాగా తీసుకున్న చర్యలు, గతంలో అమెరికాతో వాణిజ్య ఒప్పందం విషయంలో కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరును గుర్తు చేస్తున్నాయని రాహుల్ అన్నారు. అమెరికా ఒత్తిడికి ప్రధాని మోదీ మరోసారి లొంగిపోయారని వ్యాఖ్యలు చేశారు.

**కేంద్రంపై ఖర్గే ఫైర్**

కాంగ్రెస్ జాతీయ (మిగతా 2లో)

## మంత్రులతో సమావేశమైన సీఎం రేవంత్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)
తీసుకోనున్నారని తెలుస్తోంది. 22ఏ జాబితాలో ఉన్న భూముల విషయంలో నిజమైన భూ యజమానులు, కొనుగోలుదారులు ఇబ్బందులు పడకుండా అవసరమైన వెసులుబాటు కల్పించే అంశంపై ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. అసెంబ్లీలో కొనసాగనున్న చర్చలో 22ఏపై ప్రభుత్వం తరపున స్పష్టత ఇచ్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. గతంలో 22ఏ భూముల విషయంలో జరిగిన పరిణామాలు, ప్రస్తుతం ఉన్న సమస్యలు, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సభలో వివరించే అవకాశం ఉంది. అదే విధంగా అసెంబ్లీలో 22ఏ అంశాన్ని ఎలా ప్రస్తావించాలి, ప్రతిపక్షాల విమర్శలకు ఏ విధంగా సమాధానం ఇవ్వాలనే దానిపైనా మంత్రులతో చర్చించనున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న భూ అక్రమాల అంశాన్ని కూడా రేపు సభలో ప్రస్తావించాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు తెలుస్తోంది. 22ఏ భూముల వ్యవహారంలో అసలు సమస్యకు కారణాలేంటి? గతంలో భూముల కేటాయింపులు, రిజిస్ట్రేషన్లు ఎలా జరిగాయి? ఎవరి హయాంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నారు? అనే అంశాలను సభా వేదికగా సీఎం వివరించే అవకాశం ఉంది.
మొత్తంగా 22ఏ భూముల అంశంపై రేపటి అసెంబ్లీ చర్చకు ముందే రేవంత్ రెడ్డి మంత్రులతో కసరత్తు చేయనున్నారు. ఒకవైపు ప్రభుత్వ నిర్ణయంపై స్పష్టత ఇవ్వడంతోపాటు, మరోవైపు నిజంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న సామాన్యులకు వెసులుబాటు కల్పించేలా పరిష్కార మార్గాలను అన్వేషించనున్నట్లు తెలుస్తోంది.

## సౌదీ పైప్‌లైన్ మూసివేత

(మొదటి పేజీ తరువాయి)
లాటిన్ అమెరికా దేశాల నుంచి కొనుగోలు చేయాల్సి వస్తుంది. దీనివల్ల రవాణా ఖర్చులు, క్రూడాయిల్ గ్రేడ్ వ్యత్యాసాల భారం దేశీయ చమురు సంస్థలపై పడుతుంది. సౌదీ నుంచి ఎల్పీజీ దిగుమతులు కూడా జులై నుంచి పూర్తిగా నిలిచిపోయాయి. సౌదీలోని ఎర్రసముద్ర తీరంలో ఉన్న రిఫైనరీలు, విద్యుత్ ప్లాంట్లపై ఈ పైప్‌లైన్ మూసివేత ప్రభావం పడనుంది. అక్కడ ఉన్న చమురునిల్వలు కేవలం 7 నుంచి 10 రోజులు మాత్రమే సరిపోతాయని అంచనా. ఇరాన్ మద్దతు ఉన్న హూతీ రెబల్స్ దాడుల భయంతో హర్మూజ్ జలసంధి ద్వారా చమురు మళ్లింపు కూడా అంత సులభం కాదు.

**యెమెన్‌లో 500 మందికి పైగా మృతి**

ఇదిలా ఉండగా, 2022 నుంచి చాలావరకు శాంతి నెలకొల్పిన కాల్పుల విరమణ ఒప్పందం తర్వాత యెమెన్‌లో పరిస్థితులు మళ్లీ ఉద్రిక్తంగా మారుతున్నాయి. దేశం తిరిగి పూర్తిస్థాయి అంతర్యుద్ధం దిశగా వెళ్తోంది. ఎర్ర సముద్రం వెంబడి హూతీల దాడులు కొనసాగుతుండగా, దేశంలోని అంతర్గత ప్రాంతాల్లోనూ, ముఖ్యంగా చాలాకాలంగా యుద్ధభూమిగా ఉన్న తైజ్ ప్రావిన్స్‌లోనూ పోరాటం తీవ్రంగా సాగుతోంది. గత వారం రోజుల్లో యెమెన్‌లో 500 మందికి పైగా మరణించినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. అంతకుముందు వారంలో ఈ సంఖ్య దాదాపు 200గా ఉంది. హూతీ తిరుగుబాటుదారులు వేగంగా ముందుకు సాగుతూ, గతంలో అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ప్రభుత్వ దళాల ఆధీనంలో ఉన్న ప్రాంతాలను స్వాధీనం చేసుకుంటున్నారు. ఈ పోరాటం కారణంగా దాదాపు 94 వేల మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు.

## ఉద్యోగాల పేరుతో మోసం



**● 21 మందిని ముంచిన కేటుగాడు**

**టీ మీడియా , సెప్టెంబర్ 15 , హైదరాబాద్ బ్యూరో :**
ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పాడు. పరీక్షలు రాయించాడు. ఫలితాల్లో ఎంపికైనట్లు ఉద్యోగ నియామక పత్రాలు సైతం చేతిలో పెట్టాడు. సర్వీసు బుక్కులు సైతం అందించాడు. తాను ఎప్పుడు చెబితే అప్పుడు ఉద్యోగంలో చేరేందుకు రెడీగా ఉండాలని సూచించాడు. ఆ తర్వాత ఉలుకూ లేదు, పలుకూ లేదు. ఫోన్ చేస్తే స్పందన లేదు. పట్టుకుందామంటే జాడా లేదు. అలా ఒక్కరు కాదు, ఇద్దరు కాదు 21 మంది నిరుద్యోగులను నిలువునా ముంచాడు. అక్షరాలా రూ.44 లక్షలు మోసగించాడు.

**రైల్వే శాఖలో క్లర్క్? ఉద్యోగం ఇప్పిస్తానని**

కరీంనగర్ పట్టణం విద్యానగర్?లో భార్యాపిల్లలతో కలిసి అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు తిరుపతి రావు. శాతవాహన విశ్వవిద్యాలయంలో బోటనీ ప్రొఫెసర్?నని అందరితో పరిచయం చేసుకున్నాడు. విద్యానగర్?లోనే నివాసం ఉండే మమత అందరిలాగే పరిచయమైంది. డిగ్రీ పూర్తైన తన కుమార్తెకు ఉద్యోగం కోసం వెతుకుతోందావిడ. తాను పని చేస్తున్న యూనివర్సిటీలోనే రికార్డ్ అసిస్టెంట్ ఉద్యోగం ఉందని, ఇప్పించేస్తానని ఇదొక్కడే కాదు రైల్వే శాఖలో టికెట్ బుకింగ్ క్లర్క్?లు, బీసీ సంక్షేమ శాఖలో జూనియర్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఇలా వివిధ ప్రభుత్వశాఖల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పాడు. అందుకు రూ.రెండున్నర లక్షలు ఖర్చవుతుందనేది అతని అసలు డిమాండ్. సరేనన్న మమత తొలుత కొంతమొత్తాన్ని ముట్టజెప్పారు. పరీక్షలు రాయించాడు. ఎంపికైనట్లుగా అపాయిం?మెంట్ లెటర్ ఇచ్చాడు. సర్వీస్ బుక్ సైతం ముట్టజెప్పాడు. అన్నింటినీ చూసి సుమారు రూ.లక్షన్నర వరకూ ఇచ్చేశారు మమత.

**మొత్తం రూ.10 లక్షలు అప్పజెప్పారు**

ఇదంతా చూసి ఆమె బంధువులు సైతం కొందరు తిరుపతి రావును సంప్రదించారు. టికెట్ బుకింగ్ క్లర్క్ జాబులు ఇప్పించేస్తానని వారికి చెప్పాడు. వరంగల్, గోదావరిఖని, నిజామాబాద్ రైల్వే స్టేషన్లకు తీసుకువెళ్లి, అక్కడ కొందరిని చూపించి వారిక్కూడా తానే ఉద్యోగాలు ఇప్పించానని చెప్పాడు. లెటర్లు, స్టాంపులు, సంతకాలు, సర్వీసు పుస్తకాలు, నేరుగా ఉద్యోగం చేస్తున్న అభ్యర్థులు అన్నింటినీ చూసి నిజమేనని నమ్మి ఆమె బంధువులు సుమారు రూ.8.50 లక్షల మొత్తం కలిపి రూ.10 లక్షలు ముట్టజెప్పారు.
అపాయింట్?మెంట్ ఆర్డర్ చేతిలో పెట్టాక ఎప్పుడు జాయిన్ కావాలో మాత్రం అతను చెప్పలేదు. ఫోన్ చేసినా స్పందన లేదు. దీంతో మమత నేరుగా శాతవాహన విశ్వవిద్యాలయానికి వెళ్లి వీసీని కలవగా, అంతా ఫేక్ అని చెప్పడంతో ఒక్కసారిగా నోరెళ్లబెట్టాల్సిన పరిస్థితి. దీంతో బాధితురాలు కరీంనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## కేసీఆర్ ఫాంహౌస్ వద్ద శుద్ధి ఘటన

**● ఏడుగురిని అరెస్టు చేసిన పోలీసులు**

**టీ మీడియా , సెప్టెంబర్ 15 , సిద్దిపేట :**
సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని మాజీ సీఎం కేసీఆర్ ఫాంహౌస్ వద్ద పసుపు నీటితో శుద్ధి చేసిన అంశంపై పోలీసులు ఏడుగురిని అరెస్టు చేశారు. అందులో వరదరాజపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ప్రవీణ్ సైతం ఉన్నారు. పసుపు నీళ్లు చల్లి శుద్ధి చేయడం పట్ల దళిత సంఘాల నేతలు, కాంగ్రెస్ నాయకులు గజ్వేల్ ఏసీపీతో పాటు మర్కూక్ పోలీస్ స్టేషన్‌లోనూ 5 ఫిర్యాదులు చేశారు. దీనిపై ముమ్మర విచారణ చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించడంతో సవాలుగా తీసుకున్న పోలీసులు, సోమవారం ఏడుగురిని అరెస్టు చేశారు.

**సెల్ ఫోన్ సిగ్నల్స్? ట్రాకింగ్ ద్వారా**

వీరంతా ఆంధ్రప్రదేశ్? రాష్ట్రం విజయవాడలోని ఓ లాడ్జిలో ఉండగా పట్టుకున్నట్లుగా తెలుస్తోంది. వీరి ఆచూకీని సెల్ ఫోన్ సిగ్నల్స్? ట్రాకింగ్ ద్వారా కనిపెట్టినట్లు సమాచారం. లాడ్జిలో ఏడుగురు వ్యక్తులు ఉండగా, వారిలో ఒకరు తన మొబైల్ ఫోన్ ఆన్ చేయడంతోనే పోలీసులు వీరు ఉన్న ప్రాంతాన్ని గుర్తించారు. అక్కడ వీరిని అదుపులోకి తీసుకొని గజ్వేల్?కు తరలించి మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు.

# ట్రంప్ సర్కార్‌కు షాక్

(మొదటి పేజీ తరువాయి)
అభిప్రాయపడింది. కొత్త నిబంధనలు అమల్లోకి వస్తే విదేశీ విద్యార్థులు అమెరికా విశ్వవిద్యాలయాల్లో చేరేందుకు వెనుకడుగు వేసే అవకాశం ఉందని కోర్టు గుర్తించింది. దీనివల్ల ఉన్నత విద్యా సంస్థల్లో ప్రవేశాలు తగ్గడంతో పాటు అమెరికా ఆర్థిక వ్యవస్థపైనా ప్రభావం పడొచ్చని పేర్కొంది. ముఖ్యంగా నాలుగేళ్ల పరిమితి వల్ల దీర్ఘకాలిక కోర్సులు చేసే విద్యార్థులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది.
ఇదే విషయాన్ని హార్వర్డ్ విశ్వవిద్యాలయం అధ్యక్షుడు అలన్ ఎం. గార్బర్ గతంలో ప్రస్తావించారు. సాధారణంగా పీహెచ్‌డీ పూర్తి చేయడానికి కనీసం ఆరేళ్లు పడుతుందని, అలాంటప్పుడు విద్యార్థుల వీసాలకు నాలుగేళ్ల పరిమితి పెట్టడం సరైనదేనా అనే ప్రశ్నను ఆయన లేవనెత్తారు. మరోవైపు వీసా గడువులపై పరిమితులు విధించడం ద్వారా మోసాలను అడ్డుకోవచ్చని, వీసా గడువు ముగిసినా అమెరికాలో ఉండిపోయే వారిని గుర్తించడం సులభమవుతుందని ట్రంప్ ప్రభుత్వం వాదించింది. అయితే ఈ కారణాలు కొత్త నిబంధనలను సమర్థించడానికి సరిపోవని కోర్టు అభిప్రాయపడింది.చదువుకోవడానికి వెళ్లే వేలాది మంది విదేశీ విద్యార్థులకు, అలాగే జర్నలిస్టులకు ఈ తీర్పు ప్రస్తుతానికి పెద్ద ఊరటగా మారింది.

# మోదీ మళ్లీ రాజీపడ్డారు

(మొదటి పేజీ తరువాయి)
అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ లావాదేవీలపై చార్జీలు విధించేందుకు కేంద్ర ప్రభుత్వం పరోక్షంగా మార్గం సుగమం చేస్తోందని ఆరోపించారు. రూ.2 వేల వరకు జరిగే యూపీఐ లావాదేవీలకు మాత్రమే చార్జీలు ఉండవని పరిమితి విధించడం ద్వారా భవిష్యత్తులో పెద్ద మొత్తాల డిజిటల్ చెల్లింపులపై ఫీజులు విధించే అవకాశం కల్పించారని విమర్శించారు. ఇప్పటికే అధిక ద్రవ్యోల్బణంతో సామాన్యులపై ఆర్థిక భారం పెరిగిందని, ఇప్పుడు డిజిటల్ చెల్లింపులపైనా అదనపు భారం మోపే ప్రయత్నం జరుగుతోందని మండిపడ్డారు.

**పెద్ద నోట్ల రద్దును గుర్తు చేసిన ఖర్గే**

యూపీఐ చార్జీల అంశాన్ని పెద్ద నోట్ల రద్దుతో ముడిపెట్టి ఖర్గే కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దశాబ్దం క్రితం నోట్ల రద్దు నిర్ణయం దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపిందని అన్నారు. పెద్ద నోట్ల రద్దు వల్ల ఎదురైన పరిణామాలపై ప్రశ్నలు తలెత్తినప్పుడు.. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడమే ఆ నిర్ణయం వెనుక ఉద్దేశమని ప్రభుత్వం వివరించిందని గుర్తుచేశారు. నగదు రహిత ఆర్థిక వ్యవస్థ వైపు దేశాన్ని తీసుకెళ్లాలని అప్పట్లో కేంద్రం చెప్పిందని తెలిపారు. అదే సమయంలో ఇటీవల పార్లమెంటులో కేంద్ర ఆర్థిక మంత్రి యూపీఐపై ఎలాంటి పన్ను లేదా చార్జీలు విధించబోమని చెప్పినట్లు ఖర్గే గుర్తుచేశారు. అయితే తాజాగా రూ.2 వేలకుపైబడిన లావాదేవీలకు సంబంధించి చార్జీల అంశం తెరపైకి రావడంపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.
ఇదిలా ఉండగా, రూ.2వేలకు పైబడిన యూపీఐ లావాదేవీలపై మర్చంట్ ఛార్జీలపై త్వరలో బ్యాంకుల ప్యానెల్? ఒక నిర్ణయం తీసుకొనున్నట్లు సమాచారం. ఈ ప్యానెల్?లో యూపీఐ అండ్ సర్వీసెస్ స్టీరింగ్ కమిటీలో ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ), పేమెంట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ)తో సహా 22 మంది సభ్యులు ఉన్నారు.

## 40 ఎకరాల భూమి శాంతా శ్రీరామ్ సంస్థదే

**● సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి చుక్కెదురు**

**టీ మీడియా , సెప్టెంబర్ 15 , హైదరాబాద్ బ్యూరో :**
శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వానికి చుక్కెదురైంది. హైదరాబాద్?లోని 40 ఎకరాల భూమి శాంతా శ్రీరామ్ సంస్థకే చెందుతుందని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్‌కు వ్యతిరేకంగా తెలంగాణ దాఖలు చేసిన పిటిషన్?ను ఈ మేరకు సుప్రీంకోర్టు కొట్టేసింది.

**పిటిషన్?ను డిస్మిస్ చేసిన సుప్రీంకోర్టు**

హైకోర్టు తీర్పును సకాలంలో సవాలు చేయలేదన్న సుప్రీంకోర్టు తగిన సమయంలో దాఖలు చేయకపోవడంతో విచారణకు తీసుకోలేమని స్పష్టం చేసింది. దీంతో జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం పిటిషన్?ను డిస్మిస్ చేసింది. సికింద్రాబాద్ ప్రాంతంలో వివాదాస్పద భూమి ప్రైవేటు(శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్) వారికి చెందినదే అని చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌లో శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్ కేవియట్ దాఖలు చేసింది. ఈ భూమి వ్యవహారంలోనే హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై కోర్టు ధిక్కరణ కేసు నమోదైన సంగతి తెలిసిందే.

**లోతుకుంట భూములపై సర్వే పూర్తయ్యాక వాస్తవాలు తెలుస్తాయి**

లోతుకుంటలో 40 ఎకరాల భూవివాదంలో రాష్ట్ర ప్రభుత్వ పిటిషన్?ను సుప్రీంకోర్టు కొట్టివేసిన నేపథ్యంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించారు. కాలపరిమితి ముగియడంతో సాంకేతిక కారణాలతో సుప్రీంకోర్టు ఆ పిటిషన్?ను కొట్టివేసిందని పేర్కొన్న రంగనాథ్ సుప్రీంకోర్టు ఆదేశాలతో అన్ని భాగస్వామ్య వర్గాలు, రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అలాగే జనరల్ ల్యాండ్ రిజిస్టర్ 243లో పేర్కొన్న 119 ఎకరాల భూములపై సమగ్ర సర్వే నిర్వహించాలని, సర్వే ద్వారా లోతుకుంట భూమి హద్దులు, వాస్తవ పరిస్థితులు స్పష్టంగా బయడపడతాయన్నారు. అలాగే లోతుకుంటలోని సర్వే నంబరు 1, 2లోని శాంతాశ్రీరాం బిల్డర్స్? లే ఔట్‌కు ప్రస్తుతం హైడ్రా కాపాడిన ప్రభుత్వ భూమికి మధ్య దూరం దాదాపు 3 కిలోమీటర్ల వరకూ ఉందని హైడ్రా హైకోర్టుకు విన్నవించింది. సర్వే నంబర్ 1, 2 కు సంబంధించి ప్రైవేట్ భూమిపై ఉన్న కోర్టు ఉత్తర్వులకు జీఎల్ఆర్ నంబర్ 243, 255కు ఎలాంటి సంబంధం లేదని హైడ్రా వాదించింది. ఈ వివాదంపై ఇటు ప్రభుత్వం, అటు నిర్మాణ సంస్థ ఉన్నత న్యాయస్థానాలను ఆశ్రయించడంతో విచారణ జరిపిన సుప్రీంకోర్టు సాంకేతిక కారణాలతో ప్రభుత్వ పిటిషన్?ను కొట్టివేసింది.



# బస్సులో మారిన బ్యాగు

**● తెరిచి చూస్తే జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్లు**

**టీ మీడియా , సెప్టెంబర్ 15 , విజయవాడ :**
బస్సులో ప్రయాణిస్తుంటే బ్యాగులు తారుమారైపోతాయి. తీరా తెరిచి చూస్తే బ్యాగులో భారీ పేలుడు పదార్థాలు. పరుగెత్తుకుని వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేయడం లాంటి సీన్లు సినిమాల్లో చూస్తుంటాం. సరిగ్గా ఇలాంటి సన్నివేశమే విజయవాడలో జరిగింది. ఆర్టీసీ బస్సు ప్రయాణంలో పొరపాటున లగేజీ బ్యాగులు తారుమారు కావడంతో పేలుడు పదార్థాలు బయటపడటం కలకలం రేపుతోంది.

**తారుమారైన లగేజ్? బ్యాగ్?**

విజయవాడలో పేలుడు పదార్థాల రవాణా వ్యవహారం సంచలనం కలిగిస్తోంది. నరసరావుపేట నుంచి విజయవాడ వస్తున్న ఒక ప్రయాణికుడి బ్యాగ్‌లో ఏకంగా 46 జిలెటిన్ స్టిక్స్, 50 ఎలక్ట్రిక్ డిటోనేటర్లు లభ్యమయ్యాయి. సోమవారం రాత్రి పదకొండున్నర గంటల తర్వాత కృష్ణలంక పోలీసు స్టేషన్ పరిధిలోని పండిట్ నెహ్రూ బస్ స్టాండ్ పోలీస్ అవుట్ పోస్టును ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆఫిక్ ఆలి ఆశ్రయించాడు. నరసరావుపేట నుంచి బస్సులో విజయవాడకు వచ్చానని, దిగి చూసేసరికి తన లగేజీ బ్యాగ్ మరొక ప్రయాణికుడి బ్యాగ్‌తో పొరపాటున మారిపోయినట్లు గుర్తించానని చెప్పాడు. కంగారుపడి అసలు ఆ బ్యాగ్‌లో ఏముందనే కుతూహలంతో, ఆందోళనతో తెరిచి చూశానని, ఆ బ్యాగ్‌ను పరిశీలించగా అందులో



ప్రాణాంతకమైన పేలుడు పదార్థాలు కనిపించడంతో వెంటనే అప్రమత్తమై అవుట్ పోస్టులోని పోలీసులకు సమాచారం అందించినట్లు ఫిర్యాదుదారుడు తెలిపారు.
బ్యాగు ఎవరిది అనే విషయంపై విచారణ పోలీసులు బ్యాగ్‌ను తనిఖీ చేయగా అందులో ఎస్ఏఎల్వ్వీఓ సూపర్–జు 90 రకానికి చెందిన 46 జెలెటిన్ స్టిక్స్, 50 ఎలక్ట్రిక్ డిటోనేటర్లు ఉన్నట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కృష్ణలంక పోలీస్ స్టేషన్ ఎస్ఐ గిరిధర్ బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు. ఆ బ్యాగ్ అసలు ఎవరిది? భారీ పేలుడు పదార్థాలను ఎక్కడి నుంచి తీసుకొచ్చారు? ఎక్కడికి తరలిస్తున్నారు? అనే కోణాలలో పోలీసులు లోతుగా విచారణ జరుపుతున్నారు. నరసరావుపేట నుంచి విజయవాడ వరకు బస్సులో ప్రయాణించిన ప్రయాణికుల వివరాలను సేకరిస్తున్నారు. బస్ స్టాండ్ పరిసర ప్రాంతాలు, మార్గమధ్యంలోని సీసీటీవీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడిస్తామని పోలీసు అధికారులు చెబుతున్నారు.

# ప్రజలు నరకం -అధికారులు చోద్యం



### ⏭ బీసీ, ఎస్టీ కాలనీల రోడ్ల దుస్థితి

**టీమీడియా,సెప్టెంబర్15,చింతూరు:** పోలవరం జిల్లా చింతూరు డివిజన్ కేంద్రంలోని బీసీ ఎస్టీ కాలనీలలో రోడ్ల పరిస్థితి దయనీయంగా ఉంది. 20 సంవత్సరాలుగా రోడ్డు సౌకర్యం లేక ప్రజలు అల్లాడుతున్న కానీ పట్టించుకునే నాధుడే కరువైనాడు. సాయిబాబా గుడి నుండి గొల్ల బజారు మీదుగా వాళ్ళ బజారు వరకు రోడ్డు అత్యంత దుర్భరంగా ఉన్న కానీ స్థానిక అధికారులు ప్రజాప్రతినిధులు అధికార పార్టీ నాయకులు కూడా పట్టించుకోకుండా వ్యవహరించటంపై ప్రజలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు.రామాలయం నుండి ఎస్టీ కాలనీ వరకు ఉన్న రోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారి ప్రజలకు నరకం చూపిస్తుంది. పాలకులు మారుతున్నారు ప్రభుత్వాలు మారుతున్నాయి ఈ కాలనీవాసుల సమస్యలు మాత్రం మారడం లేదు. చింతూరు డివిజన్ కేంద్రంలోని ఉన్నతాధికారులు ఉన్న కానీ అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు ఎస్టీ బీసీ కాలనీవాసుల పరిస్థితి నెలకొంది.పోలవరం పేరుతో తమ కాలనీలకు రోడ్లు వేయడం లేదని ప్రజలు అనుకుంటున్నారు. కనీసం ఈ ప్రాంతం ఖాళీ చేసి వెళ్లే వరకు సుమారు రెండు సంవత్సరాలు పైగానే పడుతుంది అప్పటివరకు ఈ నరకం అనుభవించాల్సిందేనా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు పనికి వెళ్లే పెద్దలు వ్యాపారులు వాహనదారులు తిట్టుకుంటూ చీదరించుకుంటూ ఇటు అధికారులను అటు పాలకుల నిర్లక్ష్య వైఖరికి నిందిస్తున్నారు.డ్రైనేజీ వ్యవస్థ కూడా అంతంతమాత్రంగానే ఉండటంతో ప్రమాదకరమైన దోమలు వృద్ధి చెంది ప్రజా ఆరోగ్యం ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికైనా తమ కాలనీవాసులను పట్టించుకోకపోతే రానున్న స్థానిక ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పటం ఖాయమని పలువురు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# డిసెంబర్ నెలలో ప్రీమియం లీగ్

**టీ మీడియా,సెప్టెంబర్15,చింతూరు:** చింతూరు ప్రీమియర్ లీగ్ సి పి ఎల్ 3 క్రికెట్ టోర్నమెంట్ డిసెంబర్ నెలలో ప్రారంభం కానున్నదని అసోసియేషన్ కమిటీ సభ్యులు తెలిపారు.ఈ టోర్నమెంట్ ఐపీఎల్ తరహాలో వైట్ లెదర్ బాల్ తో లీగ్స్ పద్ధతిలో నిర్వహించబడుతుందని నిర్వాహకులు తెలిపారు.టోర్నమెంట్ లో 12 టీమ్స్ కు మాత్రమే అవకాశం ఉంటుందని తెలియజేశారు. ఈ టోర్నమెంట్ లో పాల్గొనే క్రీడాకారులు పోలవరం జిల్లాకు చెందిన వారు మాత్రమే పాల్గొనాలని సూచించారు.



టోర్నమెంట్ ఆడదలచిన క్రీడాకారులు అప్లికేషన్ పెట్టి వారి పేరు నమోదు చేసుకున్న తర్వాతనే క్రీడాకారులకు ఈ టోర్నమెంట్ లో ఆడే అవకాశం ఉంటుందని తెలిపారు.టోర్నమెంట్ లో ప్లేయర్స్వేలంపాట,ఆన్లైన్ స్కోరింగ్ ఉంటుందని తెలిపారు. ప్రతి జట్టు సొంత క్రికెట్ కిట్ ను కలిగి ఉండాలని, ఈ లీగ్లో పాల్గొనదలచిన టీమ్స్ ఈనెల 30వ తేదీ లోగా దరఖాస్తు నమోదు చేసుకోవాలని తెలియజేశారు. అలాగే క్రీడాకారులు కూడా అప్లికేషన్ ఈనెల 16వ తేదీ నుండి అక్టోబర్ 14వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. క్రీడాకారుల వేలంపాట అనంతరం ఈ క్రికెట్ టోర్నమెంట్ డిసెంబర్ లో ప్రారంభం కానున్నదని తెలిపారు.ఈ టోర్నమెంట్ పోలవరం జిల్లా ఏజెన్సీలోని క్రీడాకారుల ప్రతిభను వెలికి తీయడానికి ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ టోర్నమెంట్ లో పాల్గొనదలచిన వారు 7995885866, 8179340124,8985277587,7036643324 నెంబర్ లను సంప్రదించాలని తెలిపారు.

# బావిలో పడి నలుగురు అన్నదమ్ములు మృతి



### ⏭ పండగపూట కుటుంబంలో తీవ్ర విషాదం

**టీ మీడియా , సెప్టెంబర్ 15 , ఢిల్లీ బ్యూరో :** మధ్యప్రదేశ్?లోని అశోక్‌నగర్ జిల్లాలోని ఓ కుటుంబంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. వ్యవసాయ క్షేత్రంలో ఉన్న బావిలో పడి నలుగురు అన్నదమ్ములు మరణించారు. మృతిచెందిన వాళ్లంతా మైనర్లు అని, అందులో ఒకరి వయసు గరిష్ఠంగా తొమ్మిదేళ్లు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఒకే కుటుంబంలోని నలుగురు సోదరులు మృతి చెందడంతో స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి.

ఇదీ జరిగింది

అశోక్‌నగర్ జిల్లా చందేరి పోలీస్ స్టేషన్ పరిధిలోని విక్రమ్‌పూర్ గ్రామానికి చెందిన బన్వీర్ కుష్వాహకు నలుగురు కుమారులు. కుష్వాహ వ్యవసాయ కూలీ పనులు చేస్తుంటారు. ఆయన భార్య కొద్ది రోజుల కిందట పుట్టింటికి వెళ్లారు. అయితే ఇవాళ మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో కుష్వాహ కుమారులు నలుగురు తమ పొలంలోని బావిలో స్నానం చేయడానికి వెళ్లారు. ఈ క్రమంలోనే ప్రమాదం జరిగింది. ఈ మేరకు చందేరి తహసీల్దార్ దిలీప్ దరోగా తెలిపారు. ఆ సమయంలో అటుగా వెళ్తున్న అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఈ ఘటనపై తమకు సమాచారం అందించినట్లు పోలీసులు తెలిపారు. అయితే ఈ ప్రమాదానికి గల స్పష్టమైన కారణం తెలియాల్సి ఉంది.

# మిర్చి శ్యాంపిల్ బస్తాలకు బహిరంగ వేలంపాట

**వైరా :**వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని వైరా, కొణిజర్ల, తల్లాడ మండలాల్లోని కోల్డ్‌స్టోరేజ్‌లలో మిర్చి నిల్వలు ఉంచిన రైతులకు అధికారులు కీలక ప్రకటన చేశారు. రైతులు తమ శ్యాంపిల్ బస్తాలను తల్లాడ మండలం మల్లావరం సబ్‌యార్డుకు తీసుకువచ్చి బహిరంగ వేలంపాటలో పాల్గొని తమ మిర్చికి సరైన ధర పొందాలని సూచించారు.వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రకటన ప్రకారం 21.09.2026 సోమవారం ఉదయం 9.00 గంటల నుంచి మిర్చి బస్తాలకు బహిరంగ వేలంపాట నిర్వహించనున్నారు. అయితే కోల్డ్‌స్టోరేజ్‌ల వద్ద ఎటువంటి శ్యాంపిల్ మిర్చి బస్తాల వేలం జరగదని స్పష్టం చేశారు. సమావేశంలో రైతులు ఈ విషయాన్ని గమనించి వేలంపాటలో పాల్గొనాలని అధికారులు కోరారు.ఖమ్మం జిల్లా మార్కెటింగ్ అధికారి ఆర్ సంతోష్ కుమార్, మిర్చి ఇన్స్పెక్షన్ టీం నరేందర్, వీరాంజనేయులు సుమన్ పృథ్వీరాజ్. డి నిర్మల సెక్రటరీ ఏన్కూర్, ఇన్చార్జి సెక్రటరీ వైరా వి వెంకటేశ్వర్లు, కోల్డ్ స్టోరేజ్ యజమానులు మరియు వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.



**ముఖ్య సమాచారం**

తేదీ:21.09.2026,సమయం :ఉదయం 9.00 గంటల నుంచి,స్థలం:తల్లాడ--మల్లావరం సబ్‌యార్డు.

**-ప్రథమశ్రేణి కార్యదర్శి**

**వ్యవసాయ మార్కెట్ కమిటీ, వైరా**

# నేరాల నియంత్రణపై దృష్టి

### ⏭ పోలీస్ కమిషనర్ సునీల్ దత్



**టీ మీడియా,సెప్టెంబర్15, ఖమ్మం** గంజాయి వినియోగించే అవకాశం ఉన్న నిర్మానుష ప్రాంతాలు, శివారు ప్రాంతాలు, ఖాళీ ప్రదేశాలు, పాడుబడిన భవనాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పోలీస్ అధికారులకు ఆదేశించారు.పోలీస్ అధికారులతో పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. నిర్మానుష ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ గంజాయి వినియోగం, విక్రయాలు, సరఫరాకు పాల్పడే వారిని గుర్తించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.గంజాయి సరఫరా చేస్తున్న ప్రధాన వ్యక్తులను గుర్తించి, వారి నెట్‌వర్క్‌ను ఛేదించడంతో పాటు వినియోగదారులను కూడా గుర్తించి చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

సైబర్ నేరాలకు పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించి, నేరాల వెనుక ఉన్న మొత్తం నెట్‌వర్క్‌ను ఛేదించేలా దర్యాప్తు చేపట్టాలని సూచించారు. బాధితుల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి, బ్యాంకులు--ఆర్థిక సంస్థలతో సమన్వయం చేసుకుంటూ మోసపోయిన నగదును వీలైనంత త్వరగా ఫ్రీజ్ చేయించి బాధితులకు తిరిగి అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న బ్లాక్ స్పాట్లను గుర్తించి, ప్రమాదాలకు గల కారణాలను విశ్లేషించి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, రాంగ్‌రూట్ డ్రైవింగ్, హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్ వినియోగించకపోవడం వంటి ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.ప్రధాన రహదారులు, జంక్షన్లు, ప్రమాదకర మలుపుల వద్ద నిరంతర నిఘా, వాహన తనిఖీలు చేపట్టాలని, ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు.పోక్సో కేసుల్లో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి, ఆధారాలను పకడ్బందీగా సేకరించి, నిందితులకు శిక్ష పడే విధంగా కోర్టు కేసులను సమర్థవంతంగా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.పెండింగ్‌లో ఉన్న ఛార్జ్‌షీట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆలస్యం చేయకుండా వెంటనే పూర్తి చేసి కోర్టుల్లో దాఖలు చేయాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు.నేరస్తులకు శిక్ష పడేలా పకడ్బందీ దర్యాప్తు, బలమైన ఆధారాల సేకరణ, సమర్థవంతమైన ప్రాసిక్యూషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు.సమావేశంలో అడిషనల్ డీసీపీ రామానుజం, ఏసీపీ రమణమూర్తి, సాంబరాజు, ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

# విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

### ⏭ మంత్రి వివేక్ వెంకటస్వామి

**టీ మీడియా, సెప్టెంబర్ 15, రామకృష్ణాపూర్ ;** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో షేర్ ద విజన్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు స్కూల్ కిట్లను ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గురుకుల పాఠశాల అభివృద్ధికి రూ.30 లక్షల డీఎంఎఫ్ టి నిధులు మంజూరు చేసి ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేశామని, మెస్ చార్జీలు 40% పెంచామని తెలిపారు.

సోమనపల్లిలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మిస్తున్నామని చెప్పారు..ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, కౌన్సిలర్లు ,కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రఘునాథరెడ్డి, పట్టణ అధ్యక్షుడు వొడ్నాల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

### ⏭ రైతు కూలీ సంఘం డిమాండ్

**టీ మీడియా, సెప్టెంబర్ 15 ,కూసుమంచి :** స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం రైతాంగాన్ని తీవ్ర సంక్షోభంలోనికి నెట్టిందని అఖిలభారత రైతు కూలి సంఘం కూసుమంచి మండల ప్రధాన కార్యదర్శి చెరుకుపల్లి వీరయ్య ఆరోపించారు. ఈనెల 28 29 30 తేదీలలో జరుగనున్న అఖిలభారత రైతు కూలీ సంఘం జాతీయ 4వ మహాసభలను విజయవంతం చేయాలని కోరుచు, మంగళవారం మండల కేంద్రం కూసుమంచిలో జరిగిన సమావేశంలో మహాసభల పోస్టర్ను ఆవిష్కరించారు. ఏ ఐ కేఎంఎస్ కూసుమంచి మండల అధ్యక్షులు మాతంగి రామస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వీరయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 3 వ్యవసాయ నల్ల చట్టాలను, విద్యుత్ సవరణ బిల్లులను తీసుకువచ్చి, రైతు పంటను కొనుగోలు చేయకుండా, విద్యుత్తు మోటార్లకు స్మార్ట్ మీటర్లు పెట్టి వ్యవసాయ రంగాన్ని పూర్తిగా దివాలా దించే కుట్ర కు కేంద్రం పూనుకుందని ఘాటుగా విమర్శించారు.



ప్రభుత్వ రైతాంగ విధానాలకు వ్యతిరేకంగా ఖమ్మంలో ఈనెల 28వ తేదీన జరుగు భారీ బహిరంగ సభకు రైతు కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని చేయాలని వీరయ్య కోరారు. ఈ కార్యక్రమంలో ఐ ఎఫ్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఐ వెంకన్న ( ఐ వి ), సంఘం బాధ్యులు లింగ, గోపి రవి, వెంకన్న, రాంబాబు, రంగారావు, అశోక్, చంద్రు తదితరులు పాల్గొన్నారు.

# డిమార్ట్‌పై నిఘా ఏదీ?

**⏭ లైసెన్సులు, అనుమతులు పన్నులపై ప్రశ్నలు**

**⏭ రెండు రకాల ఇంటి నెంబర్ లు**






**టీ-మీడియా ,సెప్టెంబర్ 15 , ఖమ్మం బ్యూరో:** నగరంలో భారీ స్థాయిలో 3వ పట్టణ జూబ్లి పుర లో వ్యాపారం నిర్వహిస్తున్న “ డిమార్ట్” (ట్రేడ్ మార్క్)( అవెన్యూ సూపర్ మార్ట్స్ లిమిటెడ్) సంస్థకు సంబంధించి వివిధ ప్రభుత్వ శాఖల వద్ద నమోదైన అనుమతులు, లైసెన్సులు, రిజిస్ట్రేషన్లు, పన్నుల వివరాలపై ఇప్పుడు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజలకు నిత్యం అవసరమైన వస్తువులను విక్రయించే ఈ భారీ వాణిజ్య సంస్థకు సంబంధించిన అన్ని అనుమతులు, రిజిస్ట్రేషన్లు నిబంధనల ప్రకారం కొనసాగుతున్నాయా? అనే అంశంపై అధికారిక రికార్డులను పరిశీలించాల్సిన అవసరం ఉంది. అనుమతి లు అన్ని మార్ట్ లోపల భహిరంగ ప్రదర్శన చేయాలి. లూజు విక్రయాలు చేయాలి అంటే అందుకు సంబంధించిన సరుకు ను మూత వేసిన దానీ లో ఉంచడం తో పాటు, అందుకు సంబంధించిన పూర్తి వివరాలు వినియోగదారుల కు కనిపించే విధంగా ప్రదర్శన చెయ్యాలి.

చిన్న మధ్యతరగతి వ్యాపారులు పై విరుచు కు పడే అధికారులు కార్పోరేట్ సంస్థ ఆయన డీ మార్ట్ వైపు చూడక పోవడం అనుమానం కలిగిస్తుంది.

**ట్రేడ్ లైసెన్స్ ఎక్కడ?**

మున్సిపల్ పరిధిలో వ్యాపారం నిర్వహించే సంస్థకు సంబంధించి ట్రేడ్ లైసెన్స్ కీలకం. ఖమ్మండిమార్ట్ కు ప్రస్తుత ట్రేడ్ లైసెన్స్ నంబర్ ఏమిటి? ఏ తేదీ వరకు చెల్లుబాటులో ఉంది? ఎప్పుడు రెన్యువల్ చేశారు? అనే వివరాలు ప్రజలకు స్పష్టంగా తెలియాల్సి ఉంది.లైసెన్స్ ఉన్నట్లయితే దాని వివరాలను సంబంధిత అధికారు ఇంటి నంబర్ వెల్లడించాలి. లేకపోతే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుంది.

**మున్సిపల్ ఇంటి నంబర్‌పై గందరగోళం?**

చిరునామాకు సంబంధించి వేర్వేరు రికార్డుల్లో వేర్వేరు ఇంటి నంబర్‌లు కనిపిస్తున్నయి . అధికారిక స్టార్ లొకేషన్ లో/పాత రికార్డు ల్లో 5–12–75,ఇంటి నెంబర్, ట్రంక్ రోడ్ గా ఉంది.మున్సిపల్ రికార్డ్ ల్లో ఈ ఇంటి నెంబర్ నివాసం శ్రీరామ్ నగర్ గా చూపిస్తోంది. జీ ఎస్టీ రికార్డు, మున్సిపల్ రికార్డు ల్లో ఇంటి నెంబర్ 1–7–48, 49జూబ్లీ పుర అని ఉంది.

ఈనేపథ్యంలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ రికార్డుల్లో అసలు ఆస్తి నంబర్ ఏది? అన్నది స్పష్టం కావాల్సి ఉంది.జీఎస్‌టీ రికార్డులు, పాత వ్యాపార చిరునామా రికార్డులు, మున్సిపల్ ప్రాపర్టీ రికార్డులను అధికారులు సరిపోల్చి వాస్తవాన్ని వెల్లడించాల్సిన అవసరం ఉంది.

**హైదరాబాద్ అడ్రస్ తో జీఎస్టీ**

వ్యాపారం ఖమ్మం లో ఆయన జీఎస్టీ లైసెన్స్ (36AACCA8432H1ZR) అవెన్యూ సూపర్ మార్ట్ లిమిటెడ్ పేరున ఉంది. పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగా ,1/07/2017 న మాసబ్ ట్యాంక్ డిపార్ట్మెంట్ కోడ్ లైసెన్స్ జారీ అయింది.

**లేబర్ రిజిస్ట్రేషన్ ఉందా?**

వందలాది మంది పనిచేసే భారీ వాణిజ్య సంస్థలో కాంట్రాక్ట్ కార్మికులకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు, అవసరమైన కార్మిక శాఖ అనుమతులు ఉన్నాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.కార్మిక శాఖ అధికారులు గతంలో ఈ సంస్థపై తనిఖీలు నిర్వహించారా? ఏమైనా లోపాలు గుర్తించారా? నోటీసులు ఇచ్చారా? అనే వివరాలు కూడా బయటకు రావాల్సి ఉంది.

**తూనికలు–కొలతలు సక్రమమేనా?**

సూపర్ మార్కెట్‌లో ప్యాకింగ్, తూనికలు, కొలతలు, ధరల ప్రదర్శన వంటి అంశాలు వినియోగదారుల హక్కులతో నేరుగా ముడిపడి ఉంటాయి.తూనికలు, కొలతలుఅధికారులు ను ఎప్పుడు తనిఖీ చేశారు? తనిఖీల్లో ఏమైనా లోపాలు బయటపడ్డాయా? జరిమానాలు విధించారా? అనే వివరాలు కూడా ప్రజలకు తెలియాలి.

**ఫుడ్ లైసెన్స్ పరిస్థితి ఏమిటి?**

ఆహార పదార్థాల విక్రయం, ప్యాకింగ్, నిల్వకు సంబంధించి వర్తించే ఆహార భద్రతా లైసెన్లై సెన్స్ వివరాలు ఏమిటి? దాని చెల్లుబాటు ఎంత? సంస్థ పేరుతోనే ఉందా? ప్రాంగణానికి సంబంధించిన వివరాలు సరిగ్గా నమోదయ్యాయా? అనే అంశాలను కూడా పరిశీలించాల్సి ఉంది.

**పన్నులు సక్రమంగా చెల్లిస్తున్నారా?**

మున్సిపల్ ఆస్తి పన్ను, రూ 6,37, 148లు చెక్కు ద్వారా ఈ ఏడాది ఏప్రిల్ లో చెల్లించారు.ట్రేడ్ లైసెన్స్ ఫీజులు, ఇతర స్థానిక పన్నులు/ఫీజులకు సంబంధించిన చెల్లింపులు సక్రమంగా జరుగుతున్నాయా? గత సంవత్సరాల్లో ఏమైనా బకాయిలు ఉన్నాయా? అన్నదానిపై ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ స్పష్టత ఇవ్వాలి.

**అధికారుల తనిఖీలు ఎక్కడ?**

ఒక భారీ వాణిజ్య సంస్థకు సంబంధించి మున్సిపల్, కార్మిక, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ తదితర శాఖలు తమ పరిధిలో తనిఖీలు నిర్వహిస్తున్నాయా?తనిఖీలు జరిగితే నివేదికలు ఎక్కడ?లోపాలు ఉంటే చర్యలు ఏమిటి?అన్నీ సక్రమంగా ఉంటే అధికారులు ఆ విషయాన్ని ఎందుకు స్పష్టం చేయడం లేదు?అనే ప్రశ్నలు ఇప్పుడు వినిపిస్తున్నాయి.

(నిబంధన లు/చట్టాలు అతిక్రమణ మరో కదనంలో)

# సుబ్బయ్యకుంటపై సర్వే ఎప్పుడు..?



**⏭ శిఖం భూముల హద్దులు తేల్చేదెవరు..?**

**⏭ కబ్జాల ఆరోపణలున్నా కదలని యంత్రాంగం**

**టీ మీడియా,సెప్టెంబర్15,సింగరేణి(కారేపల్లి):** ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలోని సుబ్బయ్యకుంట చెరువు శిఖం భూముల వ్యవహారంపై సందిగ్ధత కొనసాగుతోంది.చెరువు భూములు ఆక్రమణలకు గురవుతున్నాయనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో శిఖం భూముల హద్దులను గుర్తించేందుకు రెవెన్యూ అధికారులు సమగ్ర సర్వే ఎప్పుడు నిర్వహిస్తారనే ప్రశ్న గ్రామస్తుల నుంచి వినిపిస్తోంది.సర్వే నంబర్ 171 పరిధిలోని భూములపై స్పష్టత తీసుకొచ్చి చెరువు భూమిని పరిరక్షించాలని వారు కోరుతున్నారు.సుబ్బయ్యకుంట శిఖం భూముల్లో కొంత భాగాన్ని వ్యవసాయ భూములుగా మార్చడంతో పాటు ప్లాట్లుగా విభజించి నిర్మాణాలు చేపడుతున్నారనే ఆరోపణలు గతంలోనే వెలుగులోకి వచ్చాయి.కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడం,మీటర్లు ఇవ్వడం,నిర్మాణాలు జరగడం వంటి అంశాలు పలు ప్రశ్నలకు తావిస్తున్నాయి.చెరువు శిఖం పరిధిలోనే ఇవి ఉంటే సంబంధిత అనుమతులు ఎలా వచ్చాయనే విషయంపై అధికారులు స్పష్టత ఇవ్వాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**శాఖల మధ్యే తిరుగుతున్న సమస్య..?**

గతంలో ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులను సంప్రదించగా సర్వేయర్ అందుబాటులో లేరనే సమాధానం రెవెన్యూ శాఖ నుంచి వచ్చినట్లు తెలిసింది.మరోవైపు సదరు భూమి తమ పరిధిలో లేదని నీటిపారుదల శాఖ అధికారులు పేర్కొనగా,లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందిస్తే పరిశీలిస్తామని విద్యుత్ శాఖ అధికారులు తెలిపిన విషయం తెలిసిందే.అయితే చెరువు భూమి అసలు ఎంత?ప్రస్తుతం ఎంత భూమి అందుబాటులో ఉంది?హద్దులు ఎక్కడి వరకు ఉన్నాయి?అనే అంశాలను తేల్చాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు.

**హద్దులు తేలితేనే..**

సుబ్బయ్యకుంటకు సంబంధించిన పాత రెవెన్యూ రికార్డులు,మ్యాపులు,సర్వే రికార్డులను పరిశీలించి క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తేనే వాస్తవ పరిస్థితి బయటపడుతుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.చెరువు శిఖం భూమిలో ఆక్రమణలు ఉన్నట్లు తేలితే వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.అదే సమయంలో పట్టా భూములైతే వాటిపై కూడా అధికారికంగా స్పష్టత ఇచ్చి అనుమానాలకు తెరదించాలని అంటున్నారు.చెరువులు గ్రామాల ఉమ్మడి ఆస్తులని,వాటి భూములను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.జిల్లా ఉన్నతాధికారులు సుబ్బయ్యకుంట వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించి రెవెన్యూ,నీటిపారుదల,పంచాయతీ, విద్యుత్ శాఖలతో సంయుక్త సర్వే నిర్వహించి శిఖం హద్దులను నిర్ధారించాలని డిమాండ్ చేస్తున్నారు.

**అనుమతులెవరివి?**

సుబ్బయ్యకుంట శిఖం భూములుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రాంతంలో విద్యుత్ స్తంభాలు,మీటర్లు,నిర్మాణాలు కనిపిస్తుండటం చర్చనీయాంశంగా మారింది.భూమి స్వభావాన్ని పరిశీలించకుండానే సంబంధిత అనుమతులు ఇచ్చారా?ఇచ్చి ఉంటే ఏ రికార్డుల ఆధారంగా ఇచ్చారు? పంచాయతీ నుంచి నిర్మాణ అనుమతులు ఉన్నాయా?అనే ప్రశ్నలకు సంబంధిత శాఖలు సమాధానం చెప్పాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# మెరుగైన సేవలే లక్ష్యంగా పనిచేయాలి



**⏭ కలెక్టర్ అంకిత్**

**⏭ ఆర్ఐ, ఎంపీడీవోపై చర్యలకు ఆదేశాలు**

**టీ మీడియా,సెప్టెంబర్15, దుమ్ముగూడెం :** మండలం మల్కానపల్లి, చిన్నబండిరేవు గ్రామాల్లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలు, సేవలు సకాలంలో అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయడంతో పాటు, పరస్పర సమన్వయంతో పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

మల్కానపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీ సర్వే పనులను కలెక్టర్ అంకిత్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి పరిశీలించారు. సుమారు 2 కిలోమీటర్లు అటవీ ప్రాంతం గుండా నడిచి క్షేత్రస్థాయిలో సర్వే పనుల పురోగతిని పరిశీలించారు. గ్రామ సరిహద్దులు, భూముల విస్తీర్ణం, ఎంజాయర్ల వివరాలు, పాత రెవెన్యూ రికార్డులు, క్షేత్రస్థాయి కొలతలు, రీ సర్వే పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సరిహద్దుల నిర్ధారణ పూర్తయినప్పటికీ రీ సర్వే ప్రక్రియ పెండింగ్‌లో ఉండటంపై కలెక్టర్ సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పాత రికార్డులు, మ్యాప్‌లు, క్షేత్రస్థాయి కొలతలను సమన్వయం చేసి భూ రికార్డుల్లో పూర్తి స్పష్టత తీసుకురావాలని సూచించారు.సర్వే పరిధిలో సుమారు 120 మంది ఎంజాయర్లు ఉన్నట్లు అధికారులు వివరించగా, వారి సంఖ్య, భూ వివరాలు, పట్టాదారు పాసుపుస్తకాల పరిస్థితి, రీ సర్వే పురోగతిపై కలెక్టర్ సంబంధిత ఆర్ఐను ప్రశ్నించారు. అయితే ఆర్ఐ సరైన వివరాలను, ప్రాథమిక సమాచారాన్ని స్పష్టంగా అందించలేకపోవడంతో కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. భూ రికార్డులు, సర్వే వివరాలపై క్షేత్రస్థాయి అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సంబంధిత ఆర్ఐపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అటవీ ప్రాంతాలకు సంబంధించిన పాత సర్వే రికార్డులు, సరిహద్దుల వివరాలను అటవీ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని రీ సర్వేను వేగవంతం చేయాలని సూచించారు. మండలంలో మొత్తం 8 గ్రామాల్లో భూ రీ సర్వే చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు 5 గ్రామాల సరిహద్దుల నిర్ధారణ పూర్తికాగా, 3 గ్రామాల్లో గ్రామసభలు పూర్తయ్యాయని, లింగాపురం పరిధిలో సుమారు 250 ఎకరాల్లో రీ సర్వే జరుగుతున్నట్లు వివరించారు. మిగిలిన పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేసేలా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం, సరైన సమాచారం అందించకపోవడంపై ఎంపీడీవోకు చార్జ్‌మెమో జారీ చేసి, 24 గంటల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ప్రయోజనం అందేలా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని నిరంతరం పర్యవేక్షించి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.చిన్నబండిరేవు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ యంత్రాంగం ప్రధాన లక్ష్యమని కలెక్టర్ అంకిత్ అన్నారు . ప్రతి అధికారి తన పరిధిలోని పనులపై పూర్తి అవగాహన కలిగి, క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.ఈ పర్యటనలో తహసీల్దార్ అశోక్ కుమార్, ఎంపీడీవో వివేక్ చంద్ర, ఆర్ఐ, సర్వే అధికారులు, రెవెన్యూ, గృహ నిర్మాణ, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచుల సంఘం ఎన్నిక



**టీ మీడియా, సెప్టెంబర్ 15 పెబ్బేరు:** వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలో వల్లపురెడ్డి రాంరెడ్డి ఫంక్షన్ హాల్ లో నూతన సర్పంచ్ ల సంఘం ఎన్నికల్లో సర్పంచుల సంఘం అధ్యక్షురాలిగా అరుణా జయపాల్ రెడ్డి కంచిరావుపల్లి సర్పంచ్ ఉపాధ్యక్షుడిగా గుడిసె అశోక్ గౌరవ సలహాదారుగా కె ఎన్ నిఖిత నాయుడు గా కార్యవర్గ సభ్యులుగా యాపర్ల స్వరాజ్యం బాబురెడ్డి రాములు యాదవ్ బాలరాజు ఈ కార్యక్రమంలో పట్టణ మండల అద్యక్షులు మార్కెట్ శ్రేణులు కాంగ్రెస్ సీనియర్ నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు

# నిత్యం మూడు పూటలా నైవేద్య కైంకర్యాలు



● **తిరుమల శ్రీవారికి**

**45 రకాల ప్రసాదాలు**

**టీ మీడియా , సెప్టెంబర్ 15 , అమరావతి బ్యూరో :** కళియుగ దైవం వేంకటేశ్వరుడ్ని తలచుకోగానే గుర్తొచ్చేది దేవదేవుడి దివ్య మంగళ స్వరూపం, నోరూరించే లడ్డూ ప్రసాదం. ఆ తిరుమలేశుడు అలంకార ప్రియుడు మాత్రమే కాదు నైవేద్య ప్రియుడు కూడా. అందుకే నిత్యం ఏడుకొండలవాడికి 45 రకాల ప్రసాదాలను సమర్పిస్తారు. తిరుమల కొండపై జరిగే నైవేద్య కైంకర్యాలు ఎంతో ప్రత్యేకం ఆసక్తికరం. తిరుమల బ్రహ్మోత్సవాల వేళ ఆ విశేషాలు మీరూ చూసేయండి.

తిరుమల శ్రీవారి ఆలయంలో నిత్యం మూడు పూటలా నైవేద్య కైంకర్యాలు జరుగుతాయి. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి ఆయా సమయాలకు అనుగుణంగా 20 అన్నప్రసాదాలు, 25 రకాల పిండి వంటకాలను బాలాజీకి సమర్పిస్తారు. శ్రీవారి నైవేద్యాల వెనుక శతాబ్దాల నాటి వైఖానస ఆగమ సంప్రదాయం ఉంది. ఆలయ పోటులో నైవేద్య పదార్థాలను ఎంతో పవిత్రతతో సిద్ధం చేస్తారు. నైవేద్యం తయారీలో ఉపయోగించే పదార్థాలు, పాత్రలు, తయారీ విధానాలకు కూడా ప్రాధాన్యం ఉంటుంది.

### భిన్నంగా పేర్లు

నైవేద్య కైంకర్యాలకు ఆలయ పరిభాషలో ఉండే పేర్లు ఎంతో భిన్నంగా ఉంటాయి. మనం ఇష్టంగా తినే పులిహోరను తింత్రిణీరసాన్నం అని పిలుస్తారు. నెయ్యి పొంగలి స్వామివారికి ముద్గాన్నం. నోరూరించే బెల్లం అన్నాన్ని గుడాన్నంగా వ్యవహరిస్తారు. కమ్మని మిరియాల అన్నాన్ని మరీచ్యాన్నంగా పిలుస్తారు. అంతేకాదు కరకరలాడే వడను మాషాపూపం అని అమృతం లాంటి దోశను చక్రప్పం అని పిలుస్తారు.

### నల్ల మిరియాలతోనే వంటకాలు

శ్రీవారి నైవేద్యాల తయారీలో మిరపకాయలకు చోటే లేదు. పచ్చిమిర్చి కానీ, ఎండుమిర్చి కానీ అస్సలు వాడరు. కారంతో పాటు ఘాటైన రుచి రావడానికి కేవలం నల్ల మిరియాలను మాత్రమే వాడతారు. వందల ఏళ్లుగా వస్తున్న ప్రాచీన సంప్రదాయం ఇది. అందుకే శ్రీవారి పులిహోర తింటుంటే ఆ మిరియాల ఘాటు, చింతపండు పులుపు కలిసి ఇచ్చే రుచి ఎంతో అమోఘం.

మొదటి గంట అనంతరం శ్రీవారికి ఉదయం నైవేద్యంగా మాత్రాన్నం, ముద్గాన్నం, తింత్రిణీరసాన్నం, దద్ధోజనం, శాకాన్నం, శర్కరాన్నం అంటే రవ్వకేసరిని సమర్పిస్తారు. అదేవిధంగా లడుకం అంటే లడ్డు, మాషాపూపం, గుడప్పం, చక్రప్పం వంటి పిండి పణ్యారములను నివేదిస్తారు. రెండో గంట అనంతరం స్వామివారికి మధ్యాహ్న నైవేద్యం లేదా రాజభోగాన్ని సమర్పిస్తారు. ఈ సమయంలో శుద్ధాన్నం అంటే తెల్ల అన్నం, పులిహోర, శీరా లేదా శక్కరభాత్‌ను నివేదిస్తారు. మూడో గంటను శయనభోగంగా పిలుస్తారు. ఈ సమయంలో మిరియాల అన్నం, లడ్డూ నివేదిస్తారు.

### ప్రతి నైవేద్యానికి ఒక్కో ప్రత్యేకత

సాయంకాల ఆరాధన సమయంలో గర్భాలయాన్ని మరోసారి శుభ్రపరిచి శ్రీవారిని తాజా పుష్పాలతో అలంకరిస్తారు. సాయంకాల కైంకర్యాల అనంతరం నిర్వహించే శయనభోగంలో భాగంగా అర్ధరాత్రి సమయంలో స్వామివారికి తిరువీసం అనే ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పిస్తారు. రోజులో చివరిగా జరిగే ఏకాంత సేవలో వెచ్చని పాలు, సీజనల్ ఫ్రూట్స్, నెయ్యిలో వేయించిన డ్రైఫ్రూట్స్‌ను ఏడుకొండలవాడికి నివేదిస్తారు. శ్రీవారికి సమర్పించే ప్రతి నైవేద్యానికి ఒక్కో ప్రత్యేకత ఉంది. పేరు నుంచి తయారీ విధానం వరకు సమర్పించే సమయం నుంచి ఆగమ సంప్రదాయం వరకు అన్నీ శాస్త్రోక్తంగా కొనసాగుతున్నాయి.

# కరువు కోరల్లో రైతన్న.. ఆదుకోవాలి



● **రైతు సంఘం జిల్లా కార్యదర్శి**

**బొంతు రాంబాబు**

**టీ మీడియా,సెప్టెంబర్15,సింగరేణి(కారేపల్లి):** కరువు పరిస్థితులతో సాగు ముందుకు సాగక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు.మంగళవారం రైతు సంఘం మండల కమిటీ సమావేశం మండల అధ్యక్షుడు ముండ్ల ఏకాంబరం అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా బొంతు రాంబాబు మాట్లాడుతూ తీవ్ర నీటి ఎద్దడితో చెరువులు నిండక పొలాలు బీడువారాయని ఆవేదన వ్యక్తం చేశారు.కరువు పరిస్థితుల్లో రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.ప్రస్తుత శాసనసభ సమావేశాల్లో కరువు పరిస్థితులపై చర్చించి,నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20 వేల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.సింగరేణి,కామేపల్లి మండలాల్లో రైతులకు వర్షాధార చెరువులు మినహా సరైన సాగునీటి వనరులు లేవన్నారు.సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందిస్తామని పాలకులు చెబుతున్నప్పటికీ,నీటిని తీసుకువచ్చేందుకు అవసరమైన నిధుల కేటాయింపులు జరగడం లేదని విమర్శించారు.. యూరియా,ఇతర ఎరువుల కోసం సుబాబుల్,జామాయిల్ సాగు చేస్తున్న రైతులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.ఎరువుల యాప్ విధానంతో రైతులకు ఇబ్బందులు పెరగడం తప్ప అదనంగా కలిగిన ప్రయోజనం ఏమిటో ప్రభుత్వం చెప్పాలని ప్రశ్నించారు.

నిషేధిత జాబితాతో రైతులకు ఇక్కట్లు

సింగరేణి మండలంలోని రేలకాయలపల్లి, బాజుమల్లాయిగూడెం,మాణిక్యారం,కోమట్లగూడెం ,ఉసిరికాయలపల్లి రెవెన్యూ గ్రామాల్లో పేద రైతుల భూములు నిషేధిత జాబితాలో చేరడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బొంతు రాంబాబు తెలిపారు.నిషేధిత జాబితాలో భూములు ఉండటంతో బ్యాంకు రుణాలు పొందలేకపోవడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో భూమిని అమ్ముకునేందుకు కూడా అవకాశం లేకుండా పోయిందన్నారు.చట్టసభల్లో నిషేధిత భూముల అంశంపై ఆరోపణలు,ప్రత్యారోపణలకే పరిమిత మవుతున్నారని,క్షేత్రస్థాయిలో పేద రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దుగ్గి కృష్ణ,ఇంజం నాగభూషణం,మండల కార్యదర్శి వజ్జా రామారావు, నాయకులు పాపినేని నాగేశ్వరరావు, కరపటి సీతారాములు,ఎస్కే సైదులు, పిప్పాల కృష్ణ,బారు నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.

# పోరాటాల రూపశిల్పి సారంపల్లి



● **సీపీఐ(ఎం) జిల్లా**

**కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు**

**టీ మీడియా,సెప్టెంబర్15,సింగరేణి(కారేపల్లి):** సాగు సమస్యలపై నిరంతరం అధ్యయనం చేస్తూ వాటి పరిష్కారం కోసం పోరాట ప్రణాళికలను రూపొందించిన నేత అఖిల భారత కిసాన్‌సభ ఉపాధ్యక్షుడు అమరజీవి సారంపల్లి మల్లారెడ్డి అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు అన్నారు. మంగళవారం కారేపల్లిలో సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.అనంతరం బొంతు రాంబాబు మాట్లాడుతూ సాగునీటి రంగ సమస్యలు,రైతాంగ ఉద్యమాలపై సారంపల్లి మల్లారెడ్డి అనేక రచనలు చేసి రైతాంగ పోరాటాలకు దిక్సూచిగా నిలిచారని కొనియాడారు.రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను లోతుగా అధ్యయనం చేసి,వాటి పరిష్కారానికి ఉద్యమ కార్యాచరణ రూపొందించడంలో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు.విత్తన రంగంపై బహుళజాతి సంస్థల పెత్తనాన్ని వ్యతిరేకించడంతో పాటు బీటీ పత్తిపై మాన్‌శాంటో కంపెనీ ఆధిపత్యానికి వ్యతిరేకంగా రైతాంగాన్ని చైతన్యపరిచారని పేర్కొన్నారు.రైతాంగం,కష్టజీవుల స్థితిగతులను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి పేదల అభివృద్ధి కోసం జీవితాంతం కృషి చేశారని అన్నారు..ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు దుగ్గి కృష్ణ,ఇంజం నాగభూషణం,వైరా డివిజన్ కార్యదర్శివర్గ సభ్యుడు వజ్జా రామారావు,నాయకులు పాపినేని నాగేశ్వరరావు,కరపటి సీతారాములు,ఎస్కే సైదులు,పిప్పాల కృష్ణ,బారు నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.

# కరాటేలో బెల్టులు సాధించిన విద్యార్థులు



**టీ మీడియా, సెప్టెంబర్ 16 పెబ్బేరు:** వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలో కరాటే శ్రీను అకాడమీ ఆధ్వర్యంలో మంగళవారం కరాటేలో బెల్ట్ ల టెస్టులు నిర్వహించారు ఎల్లో బెల్టు విభాగంలో మహతి జయదీప్ పునీత్ జస్విక్ జ్యోత్స్న నేహంత్ నారాయణ ఆరెంజ్ బెల్ట్ విభాగంలో టీనా నిత్య శ్రీ గ్రిన్ బెల్టు విభాగంలో రోహిత్ నాయక్ సాయిచరణ్ మెరున్ బెల్టు విభాగంలో జాహ్నవి బెల్టులు సాధించినట్లు మాస్టర్ శ్రీనివాసులు తెలిపారు ఈ కార్యక్రమంలో ఇన్స్ట్రక్టర్లు జాహ్నవి తస్విణ్ దనుష్ గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేటర్ విజయ్‌ను అభినందించిన కమిషనర్!!



**టి మీడియా, సెప్టెంబర్ 16, ఖమ్మం రూరల్ :** నిజాయితీకి నిదర్శనంగా నిలిచిన మున్సిపల్ కంప్యూటర్ ఆపరేటర్ విజయ్‌ను ఖమ్మం రూరల్ ఏదూలాపురం మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి మంగళవారం అభినందించారు.వివరాల్లోకి వెళితే.. ఏదులాపురం మున్సిపాలిటీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న బుద్ధి విజయ్ కుమార్ బ్యాంకు ఖాతాలోకి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఆకుల లక్ష్మి పొరపాటున రూ.52,000 జమ చేశారు. ఈ విషయం తెలుసుకున్న విజయ్ వెంటనే స్పందించి, నగదు తన ఖాతాలోకి పొరపాటున జమ అయినట్లు గుర్తించి, సంబంధిత వ్యక్తిని సంప్రదించారు. అనంతరం రూ.52,000 మొత్తాన్ని ఫోన్‌పే ద్వారా తిరిగి పంపించి తన నిజాయితీని చాటుకున్నారు.ఈ విషయాన్ని తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి, తోటి సిబ్బంది వినయ్, రాజేశ్వరి, కృష్ణవేణి, సంధ్య విజయ్‌ను అభినందించారు. ప్రజల్లో విశ్వాసం పెంచేలా నిజాయితీగా వ్యవహరించిన విజయ్‌ను ఈ సందర్భంగా కమిషనర్ ప్రత్యేకంగా ప్రశంసించారు.

# కరెంట్ కోతలతో ఎండుతున్న పంటలు




● **సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్**

**టీ మీడియా,సెప్టెంబర్15,సింగరేణి(కారేపల్లి):** కరెంట్ కోతలతో సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్,అఖిల భారత ఐక్య రైతు సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.అప్రకటిత విద్యుత్ కోతలను నిరసిస్తూ మంగళవారం సింగరేణి మండలం భాగ్యనగర్‌లోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా మాస్‌లైన్ కారేపల్లి మండల కార్యదర్శి గుమ్మడి సందీప్,అఖిల భారత ఐక్య రైతు సంఘం ఖమ్మం డివిజన్ నాయకుడు గుగులోత్ తేజానాయక్ మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో అప్రకటిత కోతల కారణంగా రైతులు,ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.వర్షాభావ పరిస్థితులతో ఇప్పటికే పంటలు దెబ్బతింటుండగా,బోర్లు,బావులపై ఆధారపడి సాగు చేస్తున్న పంటలకు కరెంట్ కోతలు శాపంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు.సాగునీరు అందించాల్సిన కీలక సమయంలో విద్యుత్ లేకపోవడంతో రైతుల కళ్లముందే పంటలు ఎండిపోతున్నాయని పేర్కొన్నారు.రైతులకు నిరంతరాయంగా విద్యుత్ అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్న మాటలకు,క్షేత్రస్థాయిలో పరిస్థితులకు పొంతన లేదని విమర్శించారు.పంటలను కాపాడుకునేందుకు రైతులు రాత్రింబవళ్లు విద్యుత్ కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి వ్యవసాయానికి అప్రకటిత విద్యుత్ కోతలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.రైతులకు కోతలు లేకుండా 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసి పంటలను కాపాడాలని కోరారు.సమస్యను పరిష్కరించకపోతే రైతులను సమీకరించి ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ధర్నాలో మాస్‌లైన్ మండల నాయకులు పుల్లకాని సత్తిరెడ్డి,రావుల నాగేశ్వరరావు,భూక్య నాగరాజు,గుమ్మడి ఎర్రయ్య,గుమ్మడి నరసింహారావు, రామారావు,కోడెం సీతారాములు,జోగ రవి, దోమల సుజాత,గుమ్మడి శిరీష,సువర్ణబాక అనసూయ,మోకాళ్ల కోటయ్య,దోమల కోటయ్య,దోమల నాగేశ్వరరావు,గుమ్మడి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

# వ్యభిచార ముఠా నిర్వాహకుడిపై పీడీ యాక్ట్

● **పోలీస్ కమిషనర్**

**టీ మీడియా,సెప్టెంబర్15, ఖమ్మం:** పోలీస్ కమిషనరేట్ పరిధిలోమహిళలను వ్యభిచారంలోకి దింపి ఆర్థిక లాభాలు పొందుతున్న బత్తుల బాలకృష్ణ పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పీడీ యాక్ట్ కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం,చిరుమర్రి గ్రామానికి చెందిన నిందితుడు బత్తుల బాలకృష్ణ, 30సం,,ఆర్థిక లాభాల కోసం జిల్లాలో వ్యభిచార గృహాలను నిర్వహిస్తూ,మహిళలను వ్యభిచారంలోకి తీసుకువచ్చే అసాంఘిక, అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. నిందితుడు బాలకృష్ణపై ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఖమ్మం టూ టౌన్, త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లలో, అనైతిక రవాణా, వ్యభిచార నిరోధక చట్టం కింద కేసులు నమోదయ్యాయి.2026 జనవరి 6న విశ్వసనీయ సమాచారం మేరకు ఖమ్మం గాంధీచౌక్‌లోని ఓ లాడ్జిలోని గది ని పోలీసులు దాడి చేశారు. వ్యభిచార కార్యకలాపాల కోసం లాడ్జిలో గది పొందేందుకు అధిక మొత్తంలో డబ్బు చెల్లించినట్లు తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు బాలకృష్ణ, మెరెడ్డి సత్యవతి, లాడ్జి మేనేజర్ అలకుంట్ల శ్రీకాంత్ తో కలిసి కుట్రపూరితంగా వ్యవహరించినట్లు తెలిపారు. కాకినాడ కు చెందిన మహిళనులి ఆర్థిక ఇబ్బందులను ఆసరాగా చేసుకొని



వ్యభిచారంలోకి తీసుకువచ్చినట్లు,ఖమ్మంకు తరలించి లాడ్జి గదిలో ఉంచి, కస్టమర్ల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు కేసు దర్యాప్తులో వెల్లడైంది.నిందితుడి నేర ప్రవర్తనను నిరోధించేందుకు శాంతిభద్రతల పరిరక్షణ, ప్రమాదకర కార్యకలాపాల నిరోధక చట్టం, 1986 (పీడీ యాక్ట్) సెక్షన్ 3(2) కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేసి చంచల్‌గూడ సెంట్రల్ జైలు కు తరలించారు.